


# మనసులోముల్లు

సుస్మిత రమణ మూర్తి

"మై డియర్ రామం!

ఈ ఉత్తరం మన గురించి కాదు. మన చంద్రం గురించి!

వాడి పరిస్థితి నీకు తెలియజేయడంకోసం!

వాడిలో ఏదో మార్పు వచ్చింది!

నా వూహకి అందని మార్పు!!

ఈ పరిస్థితిలో గనక నీవు వాణ్ణి చూస్తే — ఏడీనా మన చంద్రం?!— అంటూ ఆశ్చర్యపోతావ్. బాధపడతావ్. ప్రతి రోజూ సాయంత్రం రామకృష్ణా బీచ్‌లోనే గడిపేస్తున్నాడు వాడు — ఎప్పుడూ సముద్రంవేపు చూస్తూ.

వాడూ, నేనూ ఒకే ఫాక్టరీలో పనిచేస్తున్నామన్న మాటేగాని — ఇదివరల్లో మన మధ్య చోటుచేసుకున్న అనుబంధం, ఆత్మీయత, స్నేహభావం .. ఇప్పుడు కాగడా పెట్టి వెదికినా వాడిలో కన్పించలేదంటే నమ్ము. వాడు నాతో సరిగ్గా మాట్లాడ్డం మానేసి చాలా రోజులవుతోంది. పోనీ నేను వాణ్ణి కదిలించి విషయమేమిటో తెల్సుకుందామని పలకరించినా లాభం లేకుండా ఉంది. ఏదో పలకరించాం కదా అని మన మాటలకి బుర్ర వూపడం మాత్రమే వాడు చేస్తున్న పని. పెదవి విప్పడు. మాట బయటకు రానీడు.

ఎప్పుడూ జీవితంలో ఏదో పోగొట్టుకున్న మనిషిలా నీరసంగా, నిర్లిప్తంగా, నిస్తేజంగా కన్పిస్తున్నాడు.

తన పని — తన ధ్యాస తప్ప మరొకరి విషయం పట్టించుకోటం లేదు. పది రోజుల క్రితం వాడి నాన్నగారు బజార్లో కనిపిస్తే మన వాడి గురించి అడిగాను. ఆయన చెప్పిందాన్ని బట్టి వాడి ప్రవర్తన ఇంట్లో కూడా అలానే ఉందట.

తండ్రితో సరిగ్గా మాట్లాడటం లేదు.

తల్లి మాటల్ని పట్టించుకోటం లేదు.

భార్యని కూడా అశ్రద్ధ చేస్తున్నాడు.

ఇదివరల్లో ఎంతో ఆదరంగా, ఆప్యాయంగా చూసిన తమ్ముళ్ళని చూసి విసుక్కుంటున్నాడు.

వాడిదివరల్లా మన దారిలో పడాలంటే — వాడి బాధేమిటో?— తెలుసుకోవాలి! అందు క్కారణ మేమిటో కూడా తెలుసుకోవాలి.

ఆ తర్వాత వాడికి తెలియకుండానే వాడి మనసులో ముల్లుని మనం అతి చాకచక్యంగా తీసే మార్గం గురించి ఆలోచించి ఆచరణలో పెట్టాలి.

ఏదో చేసి వాణ్ణి మామూలు మనిషిని చేయాలన్న తాపత్రయం ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితుల్లో నీకీ ఉత్తరం రాస్తున్నాను. నీ ద్వారానైనా వాడిలో మార్పొస్తుందేమో అన్న ఆశతో నీ కీ ఉత్తరం రాస్తున్నాను.

నీవైనంత త్వరలో రావడానికి ప్రయత్నించు.

సెలవ్. నీ మిత్రుడు— శ్రీధర్.''

శ్రీధర్ వ్రాసిన ఆ ఉత్తరంతో రామం ఆలోచనల్లో చంద్రం చోటు చేసుకున్నాడు.

కాలేజీ రోజుల్లో రామం, చంద్రం, శ్రీధర్ మంచి స్నేహితులు. ముగ్గురూ అయిదేళ్ళు కష్టపడి మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీలు సంపాదించుకున్నారు. ముగ్గురిలోనూ రామం బాగా తెలివైన వాడు. చంద్రం మంచి చురుకుతనం కలవాడు. శ్రీధర్ మాత్రం మొదట్నుంచీ ముందుచూపుగల మనిషి.

చంద్రం మధ్య తరగతికి చెందిన వాడు. ఉద్యోగం దొరికిన వెంటనే చదువుకి స్వస్తి చెప్పొచ్చన్న ఉద్దేశంతో ఎమ్. ఇ.లో చేరాడు. భవిష్యత్తు గురించి కలలు కంటూ ఎమ్. ఇ. కూడా పూర్తి చేశాడు.

ఉత్తర, దక్షిణాలకి ఎటూ కాని చంద్రం ఒక ఏణ్ణర్థం నిరుద్యోగిగానే మిగిలిపోయాడు. తన ఎమ్. ఇ. చదువుకి కనీసం 'ఇంజనీరు ఉద్యోగం రాకపోతుందా? — అన్న ధీమా నీరుగారిపోగా — కనీసం ఏదో ఒక టెక్నికల్ ఉద్యోగం వస్తే చాలు— అన్న ఆశతో చేసిన ప్రయత్నం ఫలించి— ఒక ఫాక్టరీలో సూపర్‌వైజరుగా ఉద్యోగం సంపాదించుకోగలిగాడు తను. దాంతో చంద్రం ఇంట్లో వాళ్ళు సంతృప్తిగా వూపిరి పీల్చుకున్నారు. తనకూ ఒక [illegible] తెచ్చుకునే ఉద్యోగం ఉంది—అని తృప్తి పడ్డాడు చంద్రం.

శ్రీధర్ మాత్రం డిగ్రీ అయినతర్వాత వెంటనే ఉద్యోగంలో చేరగలిగాడు. ప్రస్తుతం చంద్రం, శ్రీధర్ ఒకే కంపెనీలో పనిచేస్తున్నారు.

చంద్రం ఇంజనీరింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేట్! అయినా తను సూపర్వైజరుగా చేస్తున్నాడు.

శ్రీధర్ వొట్టి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్! అయినా తను ఫోర్‌మన్‌గా చేస్తున్నాడు.

విద్యాధికుడైన చంద్రం కంటే ఉద్యోగంలో ఒక మెట్టు పైనే ఉన్నాడు. వాళ్ళ బాస్ మాత్రం మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా మాత్రం ఉన్నవాడు.

పనిలో పాతికేళ్ళ అనుభవం కలవాడు.

ఏదో జీవితంలో రాజీపడిపోయి చంద్రం, శ్రీధర్ ఆ ఉద్యోగాలు చేస్తున్నారు గాని — నిజానికి వాళ్ళు చేస్తున్న ఉద్యోగాలు వాళ్ళ చదువులకు సరిపడ్డవి కావని వారికీ తెలుసు.

రామంకూడా పెద్ద ఉన్నత దశలో కాదు.

ఉన్న వూళ్ళో ఉద్యోగం అయితే బాగుంటుందన్న కొండంత ఆశతో ఎన్నో ప్రయత్నాలు చేశాడు కాని లాభం లేకపోయింది. దాంతో ఉన్న వూరు విడిచి బొంబాయి లాంటి మహా నగరంలో తనకు ఉద్యోగం దొరక్క పోతుందా? అన్న ధీమాతో బొంబాయిలో ఉన్న వాళ్ళ స్నేహితుల ద్వారా ఒక ప్రయివేట్ కంపెనీలో ఒక వెయ్యి రూపాయల ఉద్యోగం సంపాదించుకో గలిగాడు తను.

చంద్రం, రామం, శ్రీధర్ కలుసుకుని అప్పుడే చాలా కాలం కావస్తోంది. చంద్రం, శ్రీధర్ ఒకే దగ్గర పని చేస్తున్నందుకు మొదట్లో చాలాసంతోష పడ్డారు. కాని ఆ సంతోషం వాళ్ళలో ఎంతో కాలం నిలువ లేక పోయింది. కారణం చంద్రంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు! శ్రీధర్ మాత్రం తన స్నేహాన్ని మరువకుండా ఎంతో ఆప్యాయంగా పలకరించినప్పటికీ చంద్రం మాత్రం ఇదివరలోలా తనతో కలివిడిగా మాట్లాడకపోవడం వల్ల చాలా సార్లు తనలో తనే బాధ పడ్డాడు శ్రీధర్.

చంద్రం ఏదో విషయం గురించి బాధ పడు తున్నాడన్న విషయాన్ని గ్రహించినా అసలు ఆ విషయమేమిటో? అని కొన్నాళ్ళు తెలుసుకోవ డానికి ప్రయత్నంచేసి లాభం లేక విసుగెత్తి వూరు కున్నాడు శ్రీధర్.

తను పలకరించినా ఒక్కోసారి వినిపించనట్లు నటిస్తున్న చంద్రం వింత మనస్తత్వం గురించి కేవలం బాధ పడ్డం తప్ప తను చేయగలిగిందేమీ లేక తన మిత్రుడు రామం ద్వారానైనా ఈ సమస్యకి పరిష్కారం ఉంటుందేమోనన్న ఆశతో రామంకి చంద్రం పరిస్థితిని వివరిస్తూ ఉత్తరం రాసి పడేశాడు శ్రీధర్.

శ్రీధర్ అలా ఉత్తరం రాయడంలో అర్థం లేకపోలేదు. చంద్రం తామిద్దరికీ స్నేహితుడు కావడమే అందుకు కారణం కాదు.

రామం మంచి రచయిత. మనుషులతో మాట్లా డుతూ వాళ్ళ భావాల్ని, వాళ్ళ మనసుల్ని చదవ గల నేర్పు అతని సొత్తు. అందువల్లే శ్రీధర్ రామంకి అలా ఉత్తరం రాశాడు.

చంద్రంలో శ్రీధర్ రాసినట్లు అంత విపరీతత వచ్చుంటుందా? వచ్చే ఉంటుంది. లేకుంటే శ్రీధర్ ఎందుకలా ఉత్తరం రాస్తాడు? ఒక వేళ శ్రీధర్ పొరబడ్డాడేమో చంద్రం ఆరోగ్యం ఈ మధ్య బాగుండక పోవడం వల్ల చికాగ్గా ఉంటున్నాడేమో? . . . అటువంటప్పుడు ఎవరైనా విసుక్కోవడం సరిగ్గా మాట్లాడకపోవడం వింతేమీ కాదే! ఆ మాత్రం వాడి పరిస్థితిని శ్రీధర్ అర్థం చేసుకోలేక పోయాడా? ఏమో?. . . వాడిలో వచ్చింది నా వూహకి శ్రీధర్ వూహకి అందని మార్పేమో?

ఇక్కడ్నుంచి తను విశాఖపట్నం వెళ్ళి వాడి పరిస్థితిని స్టడీ చేసి సాధ్యమైనంత తొందరలో వాణ్ణి మామూలు మనిషిగా చేయాలంటే కనీసం ఒక రెండు వారాలైనా సెలవు పెట్టాలే! తప్పదు. సెలవు పెట్టాలి. ఇటు మా వాళ్ళని చూసినట్లూ ఉంటుంది. అటు వాడి సమస్యను సాధ్యపడితే పరిష్కరించొచ్చు. తద్వారా ఒక మంచి కథకి



ఫోటో— బి. పి. రెడ్డి

వస్తువుని సంపాదించుకో వచ్చు. . . సెలవు పెట్ట డం వైజాగ్ వెళ్ళి చంద్రంని కలుసుకోవడం ఇదీ రామం ఆలోచనలకి అంతిమ రూపం.

* * *

వైజాగ్‌లో దిగిన రామం తనింటికి వెళ్ళి కాస్త ప్రయాణపు బడలిక తీర్చుకుని వీధిలోకి బయలుదేరాడు సాయంత్రం చేసి

సమయం ఆరు గంటలు కావస్తోంది.

మొదట శ్రీధర్‌ని కలుద్దామా, లేక చంద్రంని కలుద్దామా? . . . అనుకుంటూనే రామం చంద్రం ఇంటికి వెళ్ళాడు. చంద్రం ఇంట్లో లేక పోయేసరికి వీణ్ణి రేపు ఆఫీసులో కలియొచ్చు. అనుకుని రామకృష్ణా బీచికి వెళ్ళాడు రామం. బీచ్‌కి వెళ్ళిన తరవాత గుర్తొచ్చింది తనకు. 'ప్రతి రోజూ సాయంత్రం బీచ్‌లోనే వాడికి కాలక్షేపం. పిచ్చిగా సముద్రం వేపు చూస్తూ కూర్చుంటున్నాడు. అని శ్రీధర్ ఉత్తరం లోని మాటలు.

చంద్రం కోసం చూపుల వేట ప్రారంభించాడు రామం.

పది నిమిషాల తరవాత రామం దృష్టికి సముద్రపు టొడ్డున ఒక పెద్ద రాళ్ళ గుట్ట మీద ఒంటరిగా కూర్చుని తదేకంగా సముద్రం వేపు చూస్తున్న చంద్రం కనిపించాడు.

ఎక్కడో సముద్రంలో అల్లంత దూరాన ఎగిరెగిరి పడుతూ లేస్తున్న కెరటాలు ఒడ్డుకి చేరుకోవాలని ఎంతో ఆత్రంగా, ఆశగా ఒడ్డుకి రావడం సెలుసులు సెలుసులుగా విరిగి పోయి మళ్ళీ నిర్జీవంగా సముద్రం లోనే కలిసి పోవడం చూస్తున్న చంద్రం ఆశ్చర్యంతో స్వగతంలా అనుకున్నాడు: "ఆశ నిరాశ, సుఖం దుఃఖం అనేవి కేవలం మనుషులకే కాదు. కడలి లోని కెరటాలకికూడా ఉంటాయన్న మాట."

"ఎందుకు ఉండవు? కష్ట సుఖాలు మనకే కాదు. ఈ సృష్టిలోని ప్రతి ప్రాణికీ ఉంటాయ్. సముద్రం కూడా ప్రాణికోటిలోనిదే కదా? అయితే మనం ఆ కెరటాల నుంచి నేర్చుకోవలసింది చాలా ఉంది. అవి తమ ప్రయత్నం ఫలించేదాకా విసుగు, విరామం లేకుండా ప్రయత్నం మీద ప్రయత్నం చేస్తూనే ఉంటాయ్ ఒడ్డు చేరడం కోసం.

మనుషులు మాత్రం తామనుకున్నది తలపెట్టింది జరక్కపోతే మరో ప్రయత్నం చేయకుండా నిరాశా పూరితులౌతుంటారు."చంద్రంని చేరుకున్న రామం అన్నాడు.

ఆ మాటలు వచ్చిన వేపు చూశాడు చంద్రం. ఎదురుగుండా నవ్వుతూ కనిపించాడు రామం.

చంద్రంని చూసి రామం కొన్ని క్షణాలు ఆశ్చర్య పోయాడు. శ్రీధర్ రాసిన దానికంటే ఎక్కువే వచ్చినట్లుంది వీడిలో మార్పు? . . . చదువుకున్న వాడు, అన్నీ తెలిసిన వాడై ఉండికూడా ఇలా అయిపోవడం జరిగిందంటే ఏదో బలమైన కారణం ఉండి ఉండాలి.

"ఎప్పుడొచ్చేవురా?" చంద్రం పలకరింపు.

"ఈ రోజు ఉదయం వచ్చాను. దారిలో కథకి మంచి ప్లాట్ దొరికిందిలే. దాన్ని క్లియర్‌గా బుర్రలో రాసుకోడానికి ఇలా బీచ్ కొచ్చేను. అనుకోకుండా అదృష్టం కొద్దీ నీవు కన్పించావ్. బాగున్నావా?చాలా కాలమైంది కదూ?— మనం కలుసుకుని" రామం.

". . . . . . ."

"శ్రీధర్ బాగున్నాడా?" రామం.

"వాడికేం బంగారంలా ఉన్నాడు. ఉద్యోగంలో నాకంటే కాస్త మీదనే ఉన్నాడు."

"మీ నాన్నగారు — అమ్మగారు— తమ్ముళ్ళు' రామం మాటల్ని మధ్యలోనే త్రుంచేస్తూ అన్నాడు చంద్రం: "అంతా బాగానే ఉన్నారు. అందరి ఆరోగ్యం బాగానే ఉంది. తమ్ముళ్ళిద్దరూ ఎంచక్కా ఉన్నారు. వాళ్ళు కూడా అక్కడ్నుంచి మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. నాకంటే ఇద్దరూ రెండేసి వందలు ఎక్కువే తెచ్చుకుంటున్నారు."

చంద్రం మాటల్లోని విసుగు — అసహనం గ్రహించాడు రామం.

ఆ విసుగు వెనుక దాగిన తనలోని బాధని— ఆ బాధ వెనుక నిబిడీకృతమైన భావాల్ని చూచాయగా అర్థం చేసుకో గలిగాడు రామం.

ఇదన్న మాట వీడి మనసులోని బాధ!

ఇదన్న మాట వీడి మనసులోని ముల్లు!!

నా లెక్క గనక నిజమైతే వీడు మామూలు చంద్రం కావడం వెరీ సింపుల్! ...

"ఏమిట్రా ఆలోచిస్తున్నావ్? నీ కథ ఇంటి కెళ్ళిన తర్వాత తీరిగ్గా ఆలోచించుకో" నిమ్మగ్గా అన్నాడు చంద్రం.

"అబ్బే! కథ గురించి కాదురా! మన శ్రీధర్ గురించి కొస్తేను ..." రామం.

"శ్రీధర్ ఈ వూళ్ళో లేడు ప్రస్తుతం. ఆఫీసు పనిమీద నిన్ననే మద్రాసు వెళ్ళాడు. పదిహేను రోజులదాకా రాడు."

"అలాగా! అయితే వాణ్ణి కలియడం అవదన్న మాట?"

"ఇంతకీ నీ ఉద్యోగంలో మార్పేమైనా ఉందా? లేక పాలాపే ఎక్కడేసిన గొంగళి అక్కడున్నట్లేనా?"

"చాలా కరెక్ట్‌గా చెప్పావురా మన పరిస్థితి గురించి. ఎప్పట్లానే ఉంది నా పరిస్థితి కూడా."

"నీకేంరా! వెయ్యి రూపాయల ఉద్యోగం ఉంది" ఇంకా ఏదో అనబోతున్న చంద్రంకి — రామం అవకాశం ఇవ్వకుండా అందుకున్నాడు — "అవున్రా! నాకేం బంగారం లాంటి ఉద్యోగం ఉంది. వెయ్యి రూపాయల ఉద్యోగం! ఆ వెయ్యిలో పోస్ట్ సింగిల్ రూంకి ఇంటద్దె మూడొందలు పోను— మిగులు ఏడొందలు. తిండికి, బస్సులకి, తదితర అవసరాలకి ఖర్చులు పోను మిగులు — మూడొందలు. ఇంటికి పంపించే రెండొందలు పోను మిగులు — వంద రూపాయలు! ఆ వంద ఇన్స్యూరెన్సు వాళ్ళకి గోవిందా! ఇదిరా నా వెయ్యి రూపాయల బ్రతుకు!"

'అంటే!? ... రెండొందలేనా ఇంటికి పంపిస్తున్నది?" నమ్మలేనట్లు ఆశ్చర్యంగా అడిగేడు చంద్రం.

"అవున్రా! అక్షరాలా రెండొందలేరా! అంతకంటే ఎక్కువ పంపించాలని మనసులో ఉన్నా పంపించలేక పోతున్నారా! కావాలంటే మా ఇంట్లో వాళ్ళని అడిగిచూడు. నీకక్కడా బొంబాయిలో నాలాటి వెయ్యి రూపాయల ఉద్యోగం చూడమంటావేమిటి?"

"వద్దురా బాబూ! వద్దు! నీవు పడుతున్నావుగా పాట్లు. మా ఊళ్ళో వస్తున్న ఆరొందల ఉద్యోగమే నాకు చాలు!" చంద్రం.

ఫర్లేదు బండి గాడిలో పడుతోంది.

నా వూహ తప్పుకాదు. ఇలాంటి మూడ్‌లోనే సాధ్యమైనంత త్వరలో వీడిలో మార్పు తీసుకు రావాలి.

ఐతే ఎలా? ఎలా??

రామం బుర్రలో మెరుపులాంటి ఆలోచన చోటు చేసుకుంది.

అవును. అలాచేస్తే బాగానే ఉంటుంది. వెంటనే ఫలితం కన్పించొచ్చు కూడా.

తనకా ఆలోచన వచ్చినందుకు తనలో తనే నవ్వుకున్నాడు రామం.

తనను తనే అభినందించుకున్నాడు.

"ఏమిట్రా! నీలో నీవే నవ్వుకుంటున్నావ్?" చంద్రం.

"వెయ్యి రూపాయల ఉద్యోగం ఇస్తానంటే వద్దంటున్న నిన్ను చూసి నవ్వొచ్చిందంతే!" తెలివిగా సమాధానమిచ్చేడు రామం.

చంద్రం మౌనం వహించేడు.

"రేయ్, చంద్రం! ఒక వారం రోజులు సెలవు పెట్రా నీవు. చాలాకాలం అయింది కదా? మనం కలుసుకుని! ఒక వారం సరదాగా గడువుదాం!" రామం.

"ఓ యెస్! నీకోసం ప్రత్యేకంగా నేనేమీ సెలవు పెట్ట నవసరం లేదు. ప్రస్తుతం సెలవులోనే ఉన్నాను." చంద్రం.

"వెరీగుడ్! అయితే రేపు ఉదయం—అంటే ఆదివారం తొమ్మిది గంటలకి నీ ఇంటికి వస్తాను. రెడీగా ఉండు. అలా వూళ్ళో కెళ్ళి మన ఫ్రెండ్స్ అందరినీ ఒకసారి కలుద్దాం. ఇక ఇంటికి పోదాం పద!" అంటూ లేచాడు రామం.

• • •

ఆ మర్నాడు రామం, చంద్రం కలిసి బయలు దేరారు.

"మనవాళ్ళెవరైనా నీకు కనిపిస్తున్నారా?" రామం.

"ఇదివరల్లో అంటే ఒక ఏడెనిమిది నెలల క్రితం వరకూ మన వాళ్ళని ఆదివారాల్లోనూ, మిగతా సెలవు రోజుల్లోను ఆ రాజగోపాల్ ఫోటో స్టుడియో దగ్గర కలుస్తుండే వాణ్ణి. వాళ్ళ హాస్యాయణం రాను రాను నాకు బోరు కొట్టడంతో అక్కడికి వెళ్ళడం మానేశాను" చంద్రం.

"పోనీ మన బాచి, రఘురాం, మూర్తిల సంగతేమైనా నీకు తెల్సా?" రామం.

"నాకేం తెలీదురా" చంద్రం.

"గోవిందరావు సంగతో?"

"ఈ మధ్య వాడు స్టేట్స్‌కి వెళ్ళినట్లు తెలుసు. అదృష్టం అంటే వాడిదే."

"వెరీగుడ్! మనలో ఒక్కడికైనా దక్కింది ఆ అదృష్టం." వాళ్ళిద్దరూ ఫోటో స్టూడియో దగ్గరకు చేరుకునేసరికి బాచి, రఘురాం, మూర్తి హాస్యాయణం సాగిస్తున్నారు.

"ఇప్పుడే మీ ముగ్గురు గురించి మన చంద్రాన్ని అడిగానురా! అంతా బాగున్నారా?" రామం.

"కనుపట్టంలా? మా కేం బ్రహ్మాండంగా ఉన్నాం. ఇంతకీ ఎప్పుడొచ్చావ్?" రఘురాం.

సమాధానం చెప్పాడు రామం.

"ఏమిట్రా చంద్రం! కనిపించడం మానేశావ్! ఏమిటలా ఉన్నావ్?" బాచి.

"వాడి ఆరోగ్యం కొంచెం పాడైందిరా!" రామం సమాధానం. చంద్రం నోరు విప్పలేదు.

"ఏరా, బాచీ! ఉద్యోగం చేస్తున్నావా? లేక ఇంకా ఉద్యోగం కోసం కలవరిస్తూనే ఉన్నావా?" రామం.

"ఒరే రామం! మన ముఖం చూసి ఉద్యోగం ఇచ్చే నాథుడు గాని, ఇప్పిస్తానన్న భరోసా అయినా ఇచ్చే దేవుడు కాని ఇంతవరకూ నా కగుపించడం లేదంటే నమ్ము. ఏదో పది మందికి ట్యూషన్లు చెప్పుకుంటూ ఒక మూడొందలు సంపాదించుకుంటున్న స్వతంత్ర జీవిరా వీడు! ఎవరికీ తల వంచని వాడురా వీడు!" నాటకాల ప్రియుడైన బాచి నాటకం ఫక్కీలో తన గురించి సింపుల్‌గా తెలియజేశాడు.

'అంటే! వీడి కింకా ఉద్యోగం లేదన్నమాట?' చంద్రంలో ఆశ్చర్యం తలెత్తింది.

"నీ వేం జేస్తున్నావురా, మూర్తీ?" రామం.

"అన్‌కోర్స్! నాకూ ఒక ఉద్యోగం అంటూ ఉందనుకో. నే చేస్తున్న ఉద్యోగంకి నువ్వు వెలిగించిన డిగ్రీ చదువుకి ఎటువంటి సంబంధం లేని ఉద్యోగం నే చేస్తున్నది. అదైనా బాగా నిరుద్యోగం. ఇంతకీ ఏం ఉద్యోగమో తెలుసా? అలంకార్ సినిమాలో మానేజర్ ఉద్యోగం! పనెక్కువ. జీతం మాత్రం తక్కువ. ఎంతో తెలుసా? ముచ్చటగా మూడొందలైనా కాదు. అక్షరాలా రెండొందలయాభై రూపాయలు! ఇంజనీరుని అవుదా మన్న ఆశ ఇంకా నాలో చావ లేదనుకో. అందుకే ఇంకా అప్లై చేస్తూనే ఉన్నాను. అప్పుడప్పుడు ఇంటర్వ్యూలకి వెళ్ళి వస్తూనే ఉన్నాను" మూర్తి.

మూర్తి కథనం విన్న చంద్రం మరింత ఆశ్చర్య పోయాడు. 'వీడికీ ఇంకా ఉద్యోగంలేదా? ఉద్యోగం ఉన్నా ఎందుకూ పనికిరాని ఉద్యోగం! మరీ రెండు వందల యాభై రూపాయల ఉద్యోగమా? చ చ! వెధవ వుద్యోగం! తనైతే చేస్తాడా? చచ్చినా చెయ్యడు? చంద్రం ఆలోచనల పరంపర.

"ఏరా, రఘూ! నీ వేం జేస్తున్నావ్?" రామం ప్రశ్న.

"ఒక ప్రయివేట్ కంపెనీలో జూనియ రింజనీరుగా చేస్తున్నారా! పేరుకి జె. ఇ. నే కాని జీతం మాత్రం అయిదొందలేరా! ఏం జేస్తాం? మన రోజులు బాగా లేవు. మంచి రోజులు వచ్చేదాకా ఆగకపోతే ఎలా? అందుకనే ప్రస్తుతం ఉన్న ఉద్యోగాన్ని రక్షించుకుంటూ పైకి వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారా!" రఘురాం.

"గుడ్! వెరీగుడ్! విష్ యూ ద బెస్ట్ ఆఫ్ లక్!" రామం.

"వీళ్ళకంటే తనే నయంలా ఉంది! తనుకూడా ఈసారున్నుంచిఅడ్వర్‌టైజ్‌మెంట్లు చూస్తూ అప్లై చేయాలి. ఆ మాత్రం మంచి చాన్స్ తగలక పోదు!' చంద్రం స్వగతం లోని ఆశ!

"రామం! ఇంతకీ నీ సంగతి చెప్పావ్ కాదు?" బాచి.

రామం తన గురించి క్లుప్తంగా చెప్పాడు వారికి.


తనతో చదువుకున్న వాళ్ళంతా మంచి ఉద్యోగాల్లో స్థిరపడిన విషయం నిజమే అయినా బాచి, రఘురాం, మూర్తి మాత్రం ఇంకా ఆ దశకు ఆ అదృష్టానికి నోచుకోకపోవడం చాలా బాధ కలిగించింది రామంకి.

చంద్రం లాంటి 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్'లకి వాళ్ళ ద్వారా జ్ఞానోదయం కలిగించొచ్చన్న రామం ఆశ శ్రమే అక్కడ వాళ్ళ ముగ్గురు మాత్రమే ఉండేట్టు చేసిందని చంద్రం మాత్రం ఎప్పటికీ గ్రహించలేని విషయం.

పదిహేను రోజులు సెలవు పెట్టిన రామం వారం రోజుల్లోనే బొంబాయి వెళ్ళి పోయాడు చంద్రంలో వచ్చిన మార్పుకి సంతసిస్తూ.

ఆఫీసు పని పూర్తి చేసుకుని వచ్చిన శ్రీధర్ చంద్రంలోని మార్పుకి ఆశ్చర్య పోయాడు.

వారం రోజుల్లోనే వాడి బాధని అర్థం చేసుకుని అందు క్కారణం తెలుసుకుని వాడికి తెలీకుండానే వాడి మనసులోని ముల్లుని అతి చాక చక్యంగా తీసి మళ్ళీ మామూలు మనిషిని చేసిన రామంని అభినందించకుండా ఉండలేక పోయాడు శ్రీధర్. *



ఆవేశం ఫోటో— పెంచలప్ప